క్లుప్తంగా

టీడీపీ మండల కన్వీనర్ రాజీనామా


మామిళ్లపల్లి ఓంకార్

కొండాపురం: కొండాపురం టీడీపీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకార్ ఆ పార్టీకి శుక్రవారం రాత్రి రాజీనామా చేసి సోషల్ మీడియాలో వైరల్ చేసుకున్నారు. రెండు రోజుల క్రితం వింజమూరులో టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ మండల నాయకులతో సమావేశమయ్యారు. అయితే ఆకస్మికంగా రాజీనామా చేయడంతో ఆ పార్టీలోనే చర్చనీయాంశమైంది. కాకర్ల సురేష్‌కు టికెట్ ఖరారు అయినప్పటి నుంచి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు వర్గం ఆయన్ను వ్యతిరేకిస్తోంది. ఆ వర్గంలో ఉన్న ఓంకార్ సురేష్ వద్ద పార్టీ ఖర్చుల నిమిత్తం నగదు తీసుకుని రాజీనామా చేశాడని టీడీపీలో కాకర్ల వర్గం విమర్శిస్తోంది.

సొసైటీ బ్యాంకుల కంప్యూటరీకరణకు చర్యలు

- జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి


కంప్యూటరీకరణ పనులు పరిశీలిస్తున్న తిరుపతయ్య

ఉదయగిరి: జిల్లాలోని సొసైటీ బ్యాంకులన్నిటినీ కంప్యూటీకరణ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ అధికారి కె.తిరుపతయ్య తెలిపారు. ఆయన శనివారం ఉదయగిరి పట్టణంలోని కొట్టాలపల్లి సొసైటీ కార్యాలయంలో జరుగుతున్న కంప్యూటరీకరణ పనులు పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలందించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని 78 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను కంప్యూటరీకరిస్తున్నామన్నారు. త్వరలో సొసైటీలకు కంప్యూటర్లు అందించి నెట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ కోఆపరేటివ్ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులురెడ్డి, ఆడిటర్ కె.సుబ్రహ్మణ్యం, సీఈఓలు పోలయ్య, రత్తయ్య, సుబ్బారెడ్డి, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కరటంపాడులో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పర్యటన

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడులో ఆదివారం నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొంటారని మండల జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర శనివారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు కరటంపాడులో ఎన్నికల ప్రచారం, ఆరు గంటలకు మైనార్టీలతో కలిసి రంజాన్ ప్రార్థనలు, ఇఫ్తార్ విందులో పాల్గొంటారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల వారు హాజరై కార్యక్రమం జయప్రదం చేయాలని ఆయన కోరారు.

18 మద్యం బాటిళ్లు స్వాధీనం

సోమశిల: అనంతసాగరం మండలంలోని బెడుసుపల్లి రోడ్డు వద్ద బైక్‌లో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని ఏఎస్సై మస్తాన్ అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 18 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన కోసూరు కృష్ణయ్య మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు చేశారు. అతనిపై కేసు నమోదు చేశామని ఏఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి పడి మహిళ మృతి

సంగం: గేదెను తప్పించబోయే క్రమంలో బైక్ అదుపు తప్పి పడి ఓ మహిళ మృత్యువాతపడిన ఘటన మండలంలోని పెరమన వద్ద నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై శనివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. సంగం బ్రహ్మంగారి గుడి ప్రాంతానికి చెందిన తుమ్మల పెంట కామేశ్వరి (38) బేల్దారి కూలి పనులు చేస్తూ కుటుంబ పోషణ చేసుకుంటుంది. శనివారం ఉదయం బేల్దారి పనికి వింజమూరు మండలం రాజవోలుకు వెళ్లింది. అక్కడ పని ముగించుకుని సాయంత్రం బేల్దారి మేస్త్రితో కలిసి బైక్‌లో వస్తుండగా పెరమన వద్ద రోడ్డుకు అడ్డంగా గేదె పరుగెత్తడంతో బైక్ అదుపు తప్పి పడగా వెనుక కూర్చున్న కామేశ్వరి రోడ్డుపై వెనుకకు పడడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో మహిళను సంగం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సంగం ఎస్సై నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

చేజర్ల: ఓ వృద్ధుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కోటితీర్థం వెంకయ్యస్వామి ఆశ్రమంలో శుక్రవారం రాత్రి జరిగింది. జలదంకి మండలం బ్రాహ్మణక్రాకకు చెందిన పాలవెల్లి కోటారెడ్డి (81)కి ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య చాలా కాలం క్రితం మృతి చెందింది. దీంతో ఆయన ఐదేళ్లుగా కుటుంబాన్ని వదిలేసి కోటితీర్థంలోని వెంకయ్యస్వామి ఆశ్రమంలో ఉంటూ జీవనం గడుపుతున్నాడు.వయోభారం, అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఎస్సై ప్రభాకర్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.


ర్యాంప్‌పై నుంచి కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


జై జగన్ నినాదాలతో హోరెత్తిస్తున్న కార్యకర్తలు, అభిమానులు

ఎండకు ఎండినా.. ఆప్యాయతలో తడిసి..

- అర్ధగంటకు పైగా మండుటెండలోనే ప్రజలతో మమేకమైన సీఎం జగన్
- దగదర్తి మండలం ఉలవపాళ్ల కూడలి వద్ద సీఎంకు ఘన స్వాగతం
- సీఎం జగన్‌ను చూసేందుకు మండుటెండలో హైవేపై ఎదురుచూసిన జనం
- చంటి బిడ్డలతో, కాళ్లకు చెప్పులు లేకుండా నడిచొచ్చిన తల్లులు


ఆర్ఎస్సార్ స్కూల్ వద్ద వలంటీర్లతో మాట్లాడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

కావలి: 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు పల్లె జనం దగదర్తి మండలం ఉలవపాళ్ల కూడలి వద్దకు తరలి వచ్చింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు మండుటెండలు, వడగాల్పులు సైతం లెక్క చేయకుండా ప్రజలు భారీగా హైవే పైకి తరలివచ్చారు. ఒకవైపు ఎండ మండిపోతున్నా లెక్క చేయకుండా హైవేపైనే తమ 'అన్న' కోసం ఎదురుచూపులు చూశారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలోనే ఎండ 42 డిగ్రీలు దాటి రోడ్డు పైనుంచి వడగాల్పులు వీస్తున్నా లెక్క చేయకుండా నిరీక్షించారు. సుమారు 12.15 గంటల సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రోడ్‌షో ఉలవపాళ్ల కూడలికి చేరుకోగానే జనమంతా జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. ఎండధాటికి ఎండిపోయినా.. సీఎం జగన్ చూపించిన ఆప్యాయతలో తడిసి ముద్దయ్యారు. దగదర్తి, అల్లూరు మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో ఉదయం పది గంటలకే ఉలవపాళ్ల కూడలి జనంతో నిండిపోయింది. ఎటు చూసినా మేమంతా సిద్ధం ఫ్లకార్డులతో అభిమానుల సందడి కనిపించింది. ఐదేళ్లు అండగా నిలబడిన జగన్ మామయ్యను తమ పిల్లలకు చూపించేందుకు తల్లులు తమ బిడ్డలతో సహా తరలివచ్చారు. దగదర్తి ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో భారీ గజమాలతో స్వాగతం పలికారు. మధ్యాహ్నం సమయంలో తన కోసం వచ్చిన జనాలను, చంటి బిడ్డలతో తరలివచ్చిన తల్లులను చూసి జగన్‌మోహన్‌రెడ్డి చలించిపోయారు. బస్సు దిగి వచ్చి సుమారు అరగంటకు పైగా రోడ్డు పైనే ఎండలోనే జగన్‌మోహన్‌రెడ్డి కూడా వారితో మమేకమయ్యారు. తన కోసం అభిమానంతో వచ్చిన కటిక నిరుపేదలు, గిరిజనులు, ఎస్సీ, ఎస్టీలను ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు. 'ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అన్నా, పింఛన్ వస్తుందా అవ్వా, అమ్మా బిడ్డను బడికి పంపిస్తున్నావా, బాగా చదివిస్తున్నావా, ఎందుకు తల్లీ ఇంత ఎండలో చంటి బిడ్డతో వచ్చావు'... అంటూ ఆప్యాయంగా మాట్లాడడంతో జనం మురిసిపోయారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పడిన శ్రమ అంతా మర్చిపోయి ఆనందంతో హర్షధ్వానాలు చేశారు. ప్రజాసంకల్ప యాత్రలో ఎంత ఆప్యాయంగా మాట్లాడారో ఐదేళ్ల తర్వాత కూడా అంతే ఆప్యాయంగా పలుకరించారంటూ ఆనందం వ్యక్తం చేశారు. సుమారు 35 నిమిషాల తర్వాత ఉలవపాళ్ల కూడలి నుంచి జగన్‌మోహన్ రెడ్డి బస్సు యాత్ర ముందుకు కదలింది. బస్సులో సీఎం వైఎస్ జగన్‌తో పాటు రాజ్యసభ సభ్యుడు, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కావలి ప్రగతి జగనన్నకే సాధ్యం

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి ప్రాంత అభివృద్ధి, సుస్థిర ప్రగతి సీఎం జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలోని సర్వాయపాళెం క్రాస్‌రోడ్డులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభలో ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. కావలి ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రామాయపట్నం పోర్టును, తీరప్రాంత మత్స్యకారుల కోసం జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్‌ను సాకారం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఈప్రాంత ప్రజలు అంతా రుణపడి ఉంటారని తెలిపారు. రామాయపట్నం పోర్టు, అనుబంధ పరిశ్రమలతో యువతకు ఉద్యోగాలు, ఫిషింగ్ హార్బర్‌తో మత్స్యకారుల జీవితాలు బాగుపడనున్నాయన్నారు. కావలి ప్రాంతాన్ని సుస్థిర ప్రగతి దిశగా తీసుకువెళ్లే నాయకుడు జగన్ మాత్రమేనని తెలిపారు. కావలి ప్రాంతాన్నే కాకుండా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా ఆదుకున్న జగనన్నను గెలిపించుకునేందుకు జనమంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కావలి సభకు కడలి తరంగాలను తలపించేలా వచ్చిన జనసందోహానికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కావలి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రభుత్వం ఏర్పడిన వెంటనే విమానాశ్రయం

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

కావలి: 'దగదర్తి విమానాశ్రయం విషయంలో దిగులు పడొద్దు, ఎన్నికలు అయిపోయి మన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే విమానాశ్రయ పనులు ప్రారంభమవుతాయి. విమానాశ్రయమే ఒక్కటే కాదు, దగదర్తి-ముంగమూరు కాలువ, దగదర్తి-రాచర్లపాడు కాలువ పనులు కూడా పూర్తిచేద్దాం అన్నా...' అంటూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఉలవపాళ్ల కూడలి వద్దకు చేరుకోగానే దగదర్తి ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్‌నాయుడును ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి బస్సులోకి ఆహ్వానించారు. బస్సులో సీఎం జగన్‌కు దగదర్తి విమానాశ్రయ పరిస్థితిని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ ప్రసాద్ నాయుడు వివరించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో విమానాశ్రయ భూములకు సంబంధించి అప్పటి టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, స్థానిక టీడీపీ నాయకులు అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు ఆర్జించారన్నారు. బినామీ పేర్లు, భూవివాదాలతో పాటు టెండర్లు కూడా రద్దు కావడంతో విమానాశ్రయ ఏర్పాటు నిలిచిపోయిందని తెలిపారు. దగదర్తి వంటి మెట్ట ప్రాంతంలో విమానాశ్రయం వస్తే స్థానిక యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందని వివరించారు. అంతా విన్న జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ విమానాశ్రయ ఏర్పాటు తన దృష్టిలో ఉందన్నారు. ఎన్నికలు పూర్తయి మన ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే దామవరం వద్ద విమానాశ్రయ పనులు ప్రారంభమవుతాయని హామీ ఇచ్చారు.

జగనన్నను గెలిపించేందుకు మేమంతా సిద్ధం

ఆత్మకూరురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించేందుకు మేమంతా సిద్ధమని రాజీనామా చేసిన కావలి పట్టణానికి చెందిన వలంటీర్లు స్పష్టం చేశారు. జగనన్న ప్రవేశ పెట్టిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ప్రభుత్వ పథకం అవినీతికి తావులేకుండా పార్టీలు, కులమతాలతో సంబంధం లేకుండా అర్హులైన వారందరికీ అందజేశామని కావలి మున్సిపాలిటీకి చెందిన 500 మందికిపైగా వలంటీర్లు అన్నారు. ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషన్ స్కూల్ వద్దకు చేరుకున్న వలంటీర్లు సీఎంని కలిసి తమ సంఘీభావం తెలిపారు. వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశామని, రానున్న రోజుల్లో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేసేందుకు మరోసారి జగనన్నను అఖండ మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కంకణబద్ధులై పనిచేస్తామన్నారు.

హోరెత్తిన జగన్ ప్రసంగం

కావలి: కావలిలో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం ఆద్యంతం జనవాహినిని విశేషంగా ఆకట్టుకుంది. సభ ప్రారంభం నుంచి ముగింపు వరకు లక్షలాదిగా తరలివచ్చిన జనాలు జగన్ ప్రసంగాన్ని మంత్రముగ్ధులై ఆలకించారు. నిజాయితీగా, స్పష్టంగా, ముక్కుసూటిగా, సరళంగా సాగిన ప్రసంగం పల్లె జనాన్ని ప్రభావితం చేసింది. ప్రతి మాటా తూటాలా పేలడంతో జనసందోహం జేజేలు పలికింది. ప్రసంగంలో భాగంగా లక్షల సింహాల గర్జనే 'సిద్ధం' అని జగన్ అనగానే ఒక్కసారిగా ఈలలు, కేకలతో హోరెత్తించారు. ఈ ఎన్నికలు ఎంపీ, ఎమ్మెల్యేలను ఎన్నుకునే ఎన్నికలు కాదు, మీ ఐదేళ్ల తలరాతను మార్చుకునే ఎన్నికలు. పొరపాటున చంద్రబాబుకు ఓటేస్తే పులినోట్లో తలపెట్టినట్టే నంటూ 'పులి-కడియం' కథన ఉదహరించగా జనాలు మరోసారి హోరెత్తించారు. చంద్రబాబు 14 ఏళ్లలో చేసిన ఒక్క మంచి పని చెప్పమన్నా.. సిద్ధం సభల్లో ప్రశ్నిస్తే ఇంత వరకూ సమాధానం చెప్పలేదని, మీకైనా ఎప్పుడైనా చెప్పాడా అంటూ ప్రశ్నించగానే.. లేదు లేదు అంటూ ఉవ్వెత్తున బదులిచ్చారు. వేదిక ముందు వైపు జనాల్లో తిరిగేందుకు వీలుగా ఏర్పాటు చేసిన డయాస్‌పై సీఎం జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, మేకపాటి రాజగోపాల్ రెడ్డి, మేకపాటి విక్రమ్ రెడ్డి, బుర్రా మధుసూదన్‌యాదవ్, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, ఆదాల ప్రభాకర్ రెడ్డి, ఖలీల్‌తో కలిసి ప్రజలకు అభివాదం చేసే సమయంలో జనమంతా జైజగన్ నినాదాలతో హోరెత్తించారు.

అభిమాన ఝురి

కావలి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాకతో కావలి పట్టణం శనివారం జనసంద్రమైంది. సభాస్థలిని ఏర్పాటు చేసిన సర్వాయపాళెం వద్ద కిలోమీటర్ల మేర ఎటూ చూసినా ప్రజలు కిక్కిరిశారు. సభా ప్రాంగణం వద్ద స్థలం సరిపోక హైవేపై రెండు కిలోమీటర్ల మేర జనాలు బారులు దీరారు. జై.. జగన్.. జై..జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. సాయంత్రం ఐదు గంటలకు సభ ప్రారంభమయ్యే సమయానికి సభాస్థలి ఇసుక వేస్తే రాలనంతంగా జనంతో నిండిపోయింది. చంటి బిడ్డలతో వచ్చిన తల్లులు.. దివ్యాంగులు.. వృద్ధులు, ఇలా అందరూ సమావేశం పూర్తయ్యేంత వరకు అడుగు కూడా పక్కకు వేయలేదు. సంక్షేమ పథకాలతో తమ కుటుంబాలకు భరోసా కల్పించిన తమ ఇంటి పెద్దను గుండెలనిండా నింపుకొని వెనుదిరిగారు.


ఉలవపాళ్ల వద్ద తన కోసం వచ్చిన అభిమానులతో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్


యుద్ధానికి సిద్ధం అంటున్న పార్టీ శ్రేణులు


మేమంతా సిద్ధం అంటూ ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న రాజీనామా చేసిన వలంటీర్లు

సిద్ధం సభకు శ్రేణులు


ఆత్మకూరురూరల్: కరటంపాడు నుంచి సిద్ధం సభకు ..


మర్రిపాడు: సిద్ధం సభకు వెళ్తున్న నాయకులు


చేజర్ల: మదపల్లి నుంచి సిద్ధం సభకు..

కావలి వద్ద శనివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభకు ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల నుంచి భారీ పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. ఆయా మండలాల నుంచి పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలతో కలిసి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు ఉత్సాహంగా సిద్ధం సభకు తరలివెళ్లారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో సిద్ధం సభకు వెళ్తూ జయహో జగన్ అంటూ నినాదాలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్


ఆత్మకూరు: మైనార్టీ, దళితకాలనీలకు చెందిన పార్టీ శ్రేణులు..


ఏఎస్‌పేట: సిద్ధం సభకు వెళ్తున్న పార్టీ శ్రేణులు


సోమశిల: అనంతసాగరం మండల నాయకులు


ఉదయగిరి: సిద్ధం సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు


దుత్తలూరు మండలం బ్రహ్మేశ్వరం నుంచి..

కారును ఢీకొన్న లారీ

- ఆరుగురికి గాయాలు


ఆత్మకూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుజాత, రిషా

ఆత్మకూరు: పుణ్యక్షేత్రానికి వెళ్లి తిరిగి ఇంటికి కారులో వస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఆరుగురు తీవ్రంగా గాయపడిన ఘటన ఆత్మకూరు సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్సై కె.ముత్యాలరావు వివరాల మేరకు అనంతసాగరం మండలం ఎగువపల్లికి చెందిన గొల్లం సుధాకర్ నెల్లూరు డీఆర్‌డీఏ జిల్లా కార్యాలయంలో ఏపీడీగా పనిచేస్తూ నెల్లూరులోనే నివాసం ఉంటున్నాడు. శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి కర్నూలు జిల్లా మంత్రాలయం దర్శనానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై ఆత్మకూరు ఇంజనీరింగ్ కళాశాల వద్ద బద్వేల్‌కు వెళ్తున్న లారీ వీరి కారును ఢీకొంది. దీంతో కారు డ్రైవ్ చేస్తున్న సుధాకర్ స్టీరింగ్‌కు, సీటుకు మధ్య ఇరుక్కొనిపోయారు. కారులోని కుటుంబ సభ్యులు మాధవి, సుజాత, రష్మీ, శ్రీనివాసులు, రిషాలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహనంలో క్షతగాత్రులను పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సుధాకర్ అతి కష్టం మీద సుధాకర్‌ను బయటకి తీసి ఆస్పత్రికి తరలించారు. రష్మీ, సుధాకర్‌లను మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. లారీ డ్రైవర్ వాహనాన్ని వదిలి పరారైనట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.